నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్‌: లాలాగూడ సబ్‌స్టేషన్‌ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 7న ఆయా ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్‌ సీబీడీ ఏడీఈ ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విజయపురి, చిల్డ్రన్‌పార్కురోడ్, ఓయూ క్వార్టర్స్, వాటర్‌ వర్క్స్‌ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వినోభానగర్, ఇందిరానగర్, లాలాపేట్, గణేష్‌ టెంపుల్, ఇసుకబావి ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని సూచించారు.

సనత్‌నగర్‌: సంజీవయ్య పార్కు, ప్రకాష్‌నగర్‌ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్‌ ఫీడర్‌ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాటిగడ్డ క్వార్టర్స్, నూర్‌బాగ్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాటిగడ్డ రోడ్డు, నవాబ్‌ గల్లీ, పైగా ప్యాలెస్, రసూల్‌పురా సర్కిల్, భగత్‌సింగ్‌నగర్, సీపీడబ్ల్యూటీ క్వార్టర్స్, బృందావన్‌కాలనీ ప్రాంతాల్లో విద్యుత్‌ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో...)టమాటా.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 18, బెండకాయ 38, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్‌ 43, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 15, క్యారెట్‌ 35, దొండ 45, గుండుబీన్స్‌ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్‌ 35, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 10–15, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



విబ్సన్‌ ఫార్మా డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌

సికింద్రాబాద్‌: ప్రముఖ ఫార్మా సంస్థ కు చెందిన విబ్సన్‌ ఫార్మా–2025 వార్షిక డైరీని సోమవారం సికింద్రాబాద్‌ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు ప్రయోజనం కలిగేలా ఫార్మా రంగం నిర్వాహకులు తమ కార్యకలాపాలు విస్తరించుకోవాలని అన్నారు. విబ్సన్‌ ఫార్మా సంస్థ నిర్వాహకులు కరోనా కష్ట కాలంలో నగర ప్రజలకు ఉచితంగా వైద్య సేవలను అందించిందని చెప్పారు. కార్యక్రమంలో విబ్సన్‌ ఫార్మా సంస్థ చైర్మన్‌ అండ్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ సుంకు రాంచందర్‌ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే



వివరాలు సేకరిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బౌద్ధనగర్‌: వారాసిగూడ పోచమ్మ దేవాలయ సమీపంలోని వీధిలో సోమవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారి జి. చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి వివరాలను సేకరించారు. ఆధార్‌ కార్డులను పరిశీలించి, వారిని ప్రస్తుతం ఉంటున్న ఇంటి ముందు నిలబెట్టి ఫొటోలను తీశారు. సుమారు వంద వరకు దరఖాస్తులను పరిశీలించామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఆర్‌. శివకుమార్, గౌతమ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ జేఏసీ కేలండర్‌ ఆవిష్కరణ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి జేఏసీ కేలండర్‌ను ఆర్ట్స్‌ కాలేజీ ప్రిన్సిపల్‌ ప్రొ.కాశీం సోమవారం ఆవిష్కరించారు. ఓయూ విద్యార్థి జేఏసీ, టీఎస్‌ జాక్‌ చైర్మన్‌ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో రూపొందించిన 2025 కేలెండర్‌ను ప్రొ.కాశీం, ఉద్యోగ సంఘాల నేత శంకరయ్య తదితరులు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థి నాయకులు నరేష్, శివశంకర్, చంద్రశేఖర్, రమేష్, చరణ్, ఉమేష్, నవీన్, రాజేందర్, మహేష్, ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

రెండు జిల్లాల సరిహద్దు ఫ్లైఓవర్‌ విస్తరణ ఊసేదీ..?

- ప్రభుత్వం మారాక కదలిక శూన్యం..
- ఫ్లైఓవర్‌ కింది మార్గం సంగతి కూడా అంతే..
- ఎటూ తేలని పరిహారం..ఆగిన విస్తరణ..

గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు, శంకుస్థాపన



ఫతేనగర్‌ ఫ్లైఓవర్‌

సనత్‌నగర్‌: మేడ్చల్‌ మల్కాజిగిరి, హైదరాబాద్‌ జిల్లాను కలిపే ఫ్లై ఓవర్‌ అది. రెండు జిల్లాలకు సరిహద్దుగా ఉన్న ఫతేనగర్‌ ఫ్లైఓవర్‌ ఇప్పటి జనాభాకు, వాహనాల సంఖ్యకు ఏమాత్రం సరిపోవడం లేదు. అసలే ఫ్లైఓవర్‌ వెడల్పు తక్కువగా ఉండడం, ఆపై ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, మధ్యలో డివైడర్‌ నిర్మాణంతో మరింత ఇరుకుగా మారింది. దీంతో ఎటువైపు వెళ్లాలన్నా ఒక కారు మాత్రమే వెళ్లగలుగుతుందే తప్ప పక్కన మరో వాహనం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఒక కారు వెనుక మాత్రమే మరో వాహనం రావాల్సిందే. అనుకోని పరిస్థితుల్లో కారు బ్రేక్‌ డౌన్‌ అవడం గానీ, ప్రమాదం గానీ జరిగిందంటే ఇక ఫ్లైఓవర్‌ ప్రయాణం ప్రత్యక్ష నరకమే. ఫ్లైఓవర్‌పై వాహనాలు బారులుదీరి ముందుకు కదల్లేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ముందస్తు ఆలోచన లేకుండా నిర్మితమైన ఈ ఫ్లైఓవర్‌పై ప్రయాణం దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా తయారైంది. ముఖ్యంగా నర్సాపూర్, గండి మైసమ్మ, జీడిమెట్ల, షాపూర్, చింతల్, బాలానగర్, బోయిన్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి ఎస్సార్‌నగర్, అమీర్‌పేట, బేగంపేటతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ ఫ్లైఓవర్‌ దిక్కు. అప్పట్లో మంత్రి కేటీఆర్‌ 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు దీనికి శంకుస్థాపన కూడా చేశారు.

వెక్కిరిస్తున్న శిలాఫలకం..

నిధులు మంజూరై శంకుస్థాపన కార్యక్రమం కూడా జరిగినా ఫతేనగర్‌ ఫ్లైఓవర్‌ విస్తరణ పనులు ఇసుమంతైనా ముందుకు కదల్లేదు. అసలు బ్రిడ్జి విస్తరణ చేపట్టాలంటే ముందుకు ఆస్తుల సేకరణ ప్రక్రియ జరగాలి. ఎక్కడెక్కడ ఎన్ని ఆస్తులు, ఎంత మేర ఆస్తులు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందో మార్కింగ్‌ కూడా చేయాలి. ఈ తంతు ఇంతవరకు ప్రారంభమే కాదు. అసలు ఆ ఊసే లేదు. గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లైఓవర్‌ విస్తరణ ప్రాజెక్ట్‌ కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక అసలు కదలిక లేకపోవడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు.

ఫ్లైఓవర్‌ కింద రహదారి విస్తరణ కూడా అంతే..

బల్కంపేట వైపు నుంచి సనత్‌నగర్‌కు ఫ్లైఓవర్‌ కిందుగా వెళ్లే మార్గాన్నైనా సుగమం చేశారా? అంటే అదీ లేదు. ఈ మార్గమైన అందుబాటులోకి వస్తే సనత్‌నగర్, ఎర్రగడ్డ వైపు వెళ్లే వారు ఫ్లైఓవర్‌ ఎక్కాల్సిన అవసరం లేకుండా కింది నుంచి వెళ్లవచ్చు. ఫ్లైఓవర్‌ కింది మార్గం విస్తరణ జరిగే క్రమంలో ఆస్తులు కోల్పోయేవారికి పరిహారం అందించే విషయం ఎటూ తేలక తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఇటు ఫ్లైఓవర్‌ కింద మార్గం సుగమం కాక, ఇటు ఫ్లైఓవర్‌ విస్తరణ ప్రక్రియలో కదలిక లేక ట్రాఫిక్‌ తిప్పలు తప్పడం లేదు.

నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2.68 లక్షలు

- థర్డ్‌ జెండర్‌ ఓటర్లు 29 మంది
- సికింద్రాబాద్‌ ఓటర్ల జాబితా సిద్ధం
- విడుదల చేసిన ఎన్నికల అధికారులు



ఓటరు జాబితాను విడుదల చేస్తున్న ఎన్నికల అధికారి డి.సుభాష్‌రావు

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ నియోజకవర్గం ఓటర్ల జాబితా–2025 సిద్ధం అయింది. పలు కసరత్తుల అనంతరం జీహెచ్‌ఎంసీ ఎన్నికల అధికారులు సోమవారం ఓటర్ల జాబితాను విడుదల చేశారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి డి.సుభాష్‌రావు తుదిరూపు ఇచ్చిన ఓటర్ల జాబితాను జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో విడుదల చేశారు. గత ఏడాది అక్టోబర్‌ 29న ఓటర్ల జాబితా డ్రాఫ్ట్‌రోల్‌ను అధికారులు సిద్ధం చేశారు. ఆ తరువాత నియోజకవర్గ ప్రజలకు మరో అవకాశం ఇచ్చిన ఎన్నికల అధికారులు చిరునామా మార్పులు, తప్పొప్పుల సవరణలు, కొత్తగా పేర్ల నమోదు, తొలగింపు వంటి ప్రక్రియలు చేపట్టిన అనంతరం కొత్త జాబితాను జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్‌ సర్కిల్‌ ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. రెండు నెలల క్రితం రూపొందిన డ్రాఫ్ట్‌ రోల్‌కు ఇప్పటికి ఓటర్ల సంఖ్య సుమారు వెయ్యి పెరిగిందని అధికారులు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు సిద్ధంచేసిన ఓటర్ల జాబితా–2025 ప్రకారం సికింద్రాబాద్‌ నియోకవర్గ ఓటర్ల సంఖ్య 2,68,716 కు చేరింది. ఇందులో పురుషులు 1,33,981, స్త్రీలు 1,34,706, థర్డ్‌జెండర్లు 29 మంది ఉన్నట్లు అధికారులు ప్రకటించారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు రండి



ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

సనత్‌నగర్‌: ఈ నెల 10న నిర్వహించే వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో పాల్గొనాలని మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు పలు దేవాలయాల నుంచి ఆహ్వానాలు అందాయి. ఈ మేరకు సోమవారం అమీర్‌పేట డివిజన్‌ ఎస్సార్‌నగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, బాపూనగర్‌లోని శ్రీవీర హనుమాన్‌ దేవాలయాల ఈఓ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెస్ట్‌మారేడ్‌పల్లిలోని క్యాంప్‌ కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్‌ బొడ్డు కుమార్, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, బీఆర్‌ఎస్‌ నాయకులు హన్మంతరావు, సంతోష్‌కుమార్, అశోక్‌యాదవ్, హరిసింగ్, వనం శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సికింద్రాబాద్‌లోని నామాలగుండులో గల శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ చైర్మన్‌ నోముల ప్రకాష్‌ ఆహ్వానాన్ని అందజేశారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



అధికారులతో చర్చిస్తున్న డిప్యూటీ మేయర్‌ ఎం. శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక మున్సిపల్‌ డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని డిప్యూటీ మేయర్‌ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి జోనల్‌ కమీషనర్‌ రవికిరణ్‌ను కోరారు. ఈ మేరకు తార్నాక జంక్షన్‌ పునరుద్ధరణ పనులతో పాటు లాలాపేటలో మూడేళ్ల క్రితం చేపట్టిన మల్టీ పర్పస్‌ ఫంక్షన్‌ హాల్, స్విమ్మింగ్‌ పూల్‌ పనులను అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. మల్టీ పర్పస్‌ ఫంక్షన్‌ హాల్, స్విమ్మింగ్‌ పూల్‌ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని డిప్యూటీ మేయర్‌ అసహనం వ్యక్తం చేశారు. ఆ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జనవరి 26నాటికి తార్నాక జంక్షన్‌ను పునరుద్ధరించి వాహనదారులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ఏర్పాటు చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, ఏఈ వేణు, పేర్రాజు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి



ఎమ్మెల్యేను సన్మానించిన బీఆర్‌ఎస్‌ నాయకులు

అమీర్‌పేట: సనత్‌నగర్‌ డివిజన్‌ బీకేగూడ సంజయ్‌ గాంధీనగర్‌ కాలనీలో ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కాలనీ అసోసియేషన్‌ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. కాలనీ అసోసియేషన్‌ అధ్యక్షులు షాబాద్‌ శ్రీనివాస్‌రావు సోమవారం వెస్టుమారేడ్‌పల్లిలో గల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి సమస్యను వివరించారు. నిధులు మంజూరై పనులకు శంకుస్థాపన చేసినప్పటికి పనులు ప్రారంభించలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామని షాబాద్‌ తెలిపారు. కార్యక్రమంలో సంఘ సేవకులు,బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు మధుసూదన్‌రావు,టిల్లు బాయి,ప్రకాష్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

‘ధర్మశాస్త్ర భక్త బృందం సేవలు మరువలేనివి’



నిత్యావసర వస్తువుల వాహనాన్ని ప్రారంభిస్తున్న తలసాని

రాంగోపాల్‌పేట్‌: అయ్యప్ప మాల ధారణ చేసిన స్వాములకు శ్రీధర్మశాస్త్ర భక్త బృందం అందిస్తున్న సేవలు అభినందనీయమని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ అన్నారు. ఆవులమందకు చెందిన శ్రీధర్మశాస్త్ర భక్త బృందం అధ్వర్యంలో శబరిమలైలో అయ్యప్ప స్వాములకు అందించే అన్నదాన వితరణ కోసం వెళుతున్న నిత్యావసర వస్తువుల వాహనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు అన్నదానం, ప్రసాద వితరణ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. మాజీ కార్పొరేటర్‌ అత్తెల్లి అరుణగౌడ్, అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్‌ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న వెల్లాల రామ్మోహన్‌

సనత్‌నగర్‌: బీజేపీ సీనియర్‌ నేత వెల్లాల రామ్మోహన్‌ ఆధ్వర్యంలో సోమవారం సనత్‌నగర్‌ డివిజన్‌ దాసారం బస్తీలో ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మహిళలు అందమైన రంగవల్లులు వేసి ఆకట్టుకున్నారు. మహిళలు ఉత్సాహంగా ముందుకువచ్చి అందంగా ముగ్గులు వేసి తమలోని సృజనను వెలికితీస్తున్నారు. ఈ సందర్భంగా వెల్లాల రామ్మోహన్‌ మాట్లాడుతూ మహిళల్లో ప్రతిభను వెలికితీయాలనే సంకల్పంతో ఐదు రోజుల పాటు ముగ్గుల పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలకు 9వ తేదీన బహుమతుల ప్రదానం చేస్తామన్నారు.

ఓయూ లైబ్రరీలో సౌకర్యాలు కల్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ సెంట్రల్‌ లైబ్రరీలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏబీవీపీ స్టేట్‌ జాయింట్‌ సెక్రెటరీ అలివేలి రాజు సోమవారం డిమాండ్‌ చేశారు. లైబ్రరీలో చదవుకునేందుకు ప్రతి రోజూ వేయిమంది విద్యార్థులు వస్తుంటారని, కానీ వారిక కనీస అవసరాలు ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. గతంలో అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.

11న మేధావుల సంఘీభావ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఈ నెల 11న ఓయూ ఠాగూర్‌ ఆడిటోరియంలో ఆర్ట్స్‌ కాలేజ ప్రిన్సిపల్‌ ప్రొ.కాశీం అధ్యక్షతన మేధావుల సంఘీభావ సదస్సు జరగనుంది. సోమవారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట సదస్సు విజయవంతం కోసం రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొ.ఇందిరా, డా.దుబ్బరంజిత్, మహేందర్‌యాదవ్, యుగంధర్‌ పాల్గొన్నారు.

మధూస్‌ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

పంజగుట్ట: గ్రీన్‌ల్యాండ్స్‌ కూడలి వద్ద ఉన్న వైట్‌ హౌస్‌ భవనంలోని మధూస్‌ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన మధు ఎనిమిది సంవత్సరాలుగా వైట్‌హౌస్‌ భవనంలోని ఏబ్లాక్‌ గ్రౌండ్‌ ఫ్లోర్‌లో మధూస్‌ కిచ్చన్‌ పేరుతో రెస్టారెంట్‌ నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం కిచెన్‌లో వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

మా స్థలాన్ని ఆక్రమించారు..

- ప్రభుత్వానికి ఇస్తే, కబ్జాకు గురైందంటూ ఆరోపణ
- తిరిగి ఇచ్చేయాలంటూ డిమాండ్‌



తమ స్థలాన్ని ఆక్రమించారంటూ ఆరోపిస్తున్న బాధితులు

కంటోన్మెంట్‌: డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వానికి అప్పగించిన తమ స్థలం కబ్జాకు గురైందంటూ ఓ దివ్యాంగురాలైన మహిళ ఆరోపిస్తున్నారు. ఈ మేరకు తన సోదరుడు నాగేందర్‌రెడ్డితో కలిసి బాధిత మహిళ స్వప్న సోమవారం విలేకరులతో మాట్లాడారు. మారేడుపల్లి హౌజింగ్‌ బోర్డులోని తమ స్థలాన్ని కబ్జా చేసి కొందరు ఇంటిని నిర్మిస్తున్నారని వాపోయారు. 1952 నుంచి తమ కుటుంబం నివాసం ఉంటున్న స్థలాన్ని 2017లో డబుల్‌బెడ్‌ రూమ్‌ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వానికి అప్పగించామన్నారు. ఇందుకు బదులుగా తమ అత్త ఊర్మిళకు డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం తమకు డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇల్లు ఇవ్వకపోగా, తమ స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. తాతల కాలం నాటి నుంచి ఉంటున్న తమ స్థలాన్ని పద్మ అనే మహిళ కబ్జా చేసి, నిర్మాణం చేస్తుందని అంటున్నారు. పద్మకు వాళ్ల అత్త పేరిట ఇచ్చిన డబుల్‌ బెడ్‌రూమ్‌ను రద్దు చేసి, స్థలాన్ని ఎలా ఇస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్, ఆర్‌డీఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పద్మకు డబుల్‌బెడ్‌రూమ్‌కు బదులుగా స్థలం కేటాయిస్తే, తమకూ స్థలాన్ని తిరిగి ఇచ్చేయాలంటూ డిమాండ్‌ చేస్తున్నారు.

కలెక్టర్‌ ఆదేశాలతోనే

కలెక్టర్‌ ఆదేశాల మేరకే తాము పద్మ అనే మహిళకు హౌజింగ్‌ బోర్డు స్థలాన్ని కేటాయించాం. తమ కుటుంబానికి 2 లేదా అంతకంటే ఎక్కువ డబుల్‌ బెడ్‌రూమ్‌లు కేటాయించాలని పద్మ డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో తమ స్థలం తిరిగి ఇచ్చేయాలంటూ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్‌ ఆదేశాలతో పద్మ అత్తకు వెంకటమ్మకు కేటాయించిన డబుల్‌ బెడ్‌రూమ్‌ పట్టా రద్దు చేసి, స్థలాన్ని అప్పగించేశాం.

– భీమయ్య గౌడ్, మారేడుపల్లి తహసీల్దార్‌

ముక్తా సాల్వే జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

ఉస్మానియా యూనివర్సిటీ: సావిత్రిబాయి పూలే తొలి విద్యార్థి ముక్తాసాళ్వే జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని వక్తలు డిమాండ్‌ చేశారు. ఓయూలో మాంగ్‌ సమాజ్‌ విద్యార్థులు ముక్తా సాల్వే జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రామనికి మాంగ్‌ సమాజ్‌ రాష్ట్ర అధ్యక్షులు గాయక్వాడ్‌ తులసీదాస్‌ మాంగ్‌ ముఖ్యఅతిథిగా విచ్చేసి ముక్తాసాళ్వే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కాంబ్లే సుధాకర్‌ మాంగ్, నామ్‌వాడ్‌ రమాకాంత్‌ మాంగ్‌ పాల్గొన్నారు.

అరుంధతీబంధు సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మృతి



నర్సింగరావు (ఫైల్‌)

చిలకలగూడ: అరుంధతీబంధు సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగరావు (82) సీతాఫల్‌మండి మేడిబావిలో ఆదివారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మాదిగల హక్కులు, అభివృద్ధి, అభ్యున్నతి కోసం సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఆయన కృషి చేశారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆదాయపు పన్నుశాఖ అధికారిగా పనిచేసి పదవీవిరమణ పొందిన నర్సింగరావుకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

‘లక్ష డప్పులు... వేల గొంతులు’ను విజయవంతం చేయాలి

సన్నాహక సమావేశంలో గాయకులు ఏపూరి సోమన్న, ఎన్‌వై అశోక్‌



సమావేశంలో మాట్లాడుతున్న ఏపూరి సోమన్న, ఎన్‌వై అశోక్‌ మాదిగ

పద్మారావునగర్‌: నగరంలో ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించే లక్షడప్పులు.. వేల గొంతులు కార్యక్రమానికి లక్షలాదిగా మాదిగ, మాదిగ ఉపకులాలు తరలి రావాలని వక్తలు పిలుపునిచ్చారు. సనత్‌నగర్‌ అసెంబ్లీ నియోజకవర్గం మాదిగ హక్కుల అభివృద్ధి ఐక్య జేఏసీ అధ్వర్యంలో బోలక్‌పూర్‌ ఎవర్‌గ్రీన్‌ ఫ్రెండ్స్‌ అసోసియేషన్‌ కమ్యూనిటీహాల్‌లో సన్నాహక సమావేశం జరిగింది. స్థానిక నాయకులు ఏసూరి మహేష్, పి. మహేందర్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు ఏపూరి సోమన్న, ఎమ్మార్పీఎస్‌ కళామండలి రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌వై అశోక్, ఎమ్మార్పీఎస్‌ సనత్‌నగర్‌ ఇన్‌చార్జీ నర్సింహ, ఏసూరి మహేష్, కేఎం క్రిష్ణ, రాగటి సత్యం, డాక్టర్‌ శివకుమార్‌ లాల్, ఎస్‌ఆర్‌ మల్లేష్, ఎస్‌. రాజు. తదితరులు మాట్లాడారు. ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్‌ వర్గీకరణ ద్వారా దళితుల్లోని 59 కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. కోర్టులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, యావత్తు సమాజం ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చినా కొంత మంది స్వార్థపర శక్తులు అడ్డుకుంటున్నారని మండి పడ్డారు. అంతకు ముందు గాయకులు ఏపూరి సోమన్న, ఎన్‌వై అశోక్‌ ఆలపించిన పాటలు సభికులను ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో లక్ష్మీపతి, రాంబాబు, బొడ్డు మహేష్, కుర్మ మహేందర్, దేవేందర్, విజయ్‌ శంకర్, మాచర్ల ప్రభాకర్, శంకర్, రవి, రాపాక అశోక్‌ హాజరయ్యారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ అమలు చేయాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిలకలగూడ: కాంగ్రెస్‌ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేసి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ నాయకులు డిమాండ్‌ చేశారు. మెట్టుగూడ డివిజన్‌ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్‌ నేతృత్వంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. కులగణన, కుటుంబసర్వే పేర్లతో కాంగ్రెస్‌ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురిచేసిందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్, రజక సెల్‌ కన్వీనర్‌ రాజేశ్వరిపాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌ హామీపై మౌనం వీడండి



వినతి పత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌ అంశం పై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వీడాలని కాంట్రాక్టు టీచర్స్‌ జేఏసీ అధ్యక్షులు డా.రామేశ్వర్‌రావు, కార్యదర్శి డా.శ్రీధర్‌ కుమార్‌లోద్‌ డిమాండ్‌ చేశారు. అధికారం చేపట్టి ఏడాది గడిచినా సీఎం రేవంత్‌ రెడ్డి ఇంత వరకు పర్మనెంట్‌ ఊసెత్తడం లేదని ఆవేదన వ్యక్తకు చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్‌ చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ ప్రొ.బాలకృష్ణరెడ్డికి సోమవారం వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయండి



వినతి పత్రం అందజేస్తున్న కొల్లూరి వెంకట్‌

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎంఎస్‌ఎఫ్‌–టీఎస్‌ నాయకులు సోమవారం ఏకసభ్య కమిషన్‌ చైర్మన్‌ జస్టిస్‌ షమీమ్‌ అక్తార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎస్సీలలో జనాభా దామాషా ప్రకారం మాదిగలు, ఉపకులాల వర్గీకరణ చేపట్టాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరి వెంకట్, వర్కింగ్‌ ప్రసిడెంట్‌ చందు, ఓయూ అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

క్యూసీఎఫ్‌ఐకి రెండు వరల్డ్‌ రికార్డులు

పంజగుట్ట: దేశంలోనే మొదటిసారి క్వాలిటీ సర్కిల్‌ ఫోరం ఆఫ్‌ ఇండియా (క్యూసీఎఫ్‌ఐ) సంస్థకు అమెరికాకు చెందిన వరల్డ్‌ రికార్డ్స్‌ యూనియన్‌ వారు రెండు అవార్డులు ఇచ్చినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వస్తువులోనాణ్యత, ఉద్యోగుల భద్రత, వినియోగదారునికి తక్కువ ధరలో వస్తువులు అందించడంలో మేళకువలు నేర్పే తమ సంస్థకు ఈ అవార్డులు రావడం ఎంతో సంతోషకరమని వారు పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం ఎగ్జిక్యూటీవ్‌ డైరెక్టర్‌ డి.కె.శ్రీవాత్సవ, డైరెక్టర్‌ మనోహర్, చేతన్‌ చితాల్కర్, మాజీ డైరెక్టర్‌ శ్రీనివాసన్‌లు మాట్లాడుతూ తామది లాభాపేక్ష లేని సంస్థఅని తమ సంస్థలో 2వేలకు పైగా పెద్ద, మధ్యతరహా, చిన్న సంస్థలు జీవితకాల సభ్యత్వం తీసుకుని వాటివ్యాపార అభివృద్ధిని మెరుగుపరచడంలో అద్భుత ఫలితాలు సాధించాయని తెలిపారు.